క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయానికి రంగులు



శాయంపేట : స్థానిక తహసీల్దార్ కల్వల సత్యనారాయణ గత నెలలో విధుల్లో చేరారు. కార్యాలయం బోర్డు పిచ్చిమొక్కలతో కనిపించి ఉండగా గమనించిన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రహరీ గోడలకు రంగులు వేయించడంతో కార్యాలయం కళకళలాడుతోంది. తహసీల్దార్ దసరాకు కొత్త రంగులు అద్దించి కళకళలాడేలా ఉంచగా మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన జీవనజ్యోతి పొదుపు పరపతి పరస్పర సహాయ సహకార సంఘం సభ్యుడు గిరబోయిన రమణయ్య గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సంఘ సభ్యులు రూ.40 వేలు జమ చేసి శుక్రవారం ఆయన కూతురు గిరబోయిన సుష్మిత పేరున ఎస్‌బీఐలో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందించారు. కుటుంబ సభ్యులకు మేమున్నామని ధైర్యాన్ని ఇచ్చారు. పరామర్శించిన వారిలో సంఘం అధ్యక్షులు బుర్రి మహేందర్, ఉపాధ్యక్షుడు గజ్జి మహేందర్, కార్యదర్శి గజ్జి రమేష్, కోశాధికారి గుమ్మడి రమేష్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రావణవధకు ఏర్పాట్లు పూర్తి

శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలోని మైదానంలో రావణవధకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాంగ్రెస్ యూత్ మండల నాయకుడు సాదు నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని దాతల సహకారంతో రావణవధ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం జరిగే ఉత్సవాల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

ఆత్మకూరు : అనారోగ్య బాధలు తాళలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దూలం సమ్మక్క (83) అనారోగ్య సమస్యలు భరించలేక శుక్రవారం బాత్‌రూం క్లీనర్ ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు ఆత్మకూరు సీఐ సంతోష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలు సాధించిన పలువురికి సన్మానం



వేలేరు : మండల కేంద్రానికి చెందిన జోగు మహేందర్, కొయ్యడ అనూష, గజ్జెల్లి పూర్ణచందర్‌లు ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ఉద్యోగాలు సాధించిన వారిని శాలువాలతో సత్కరించి స్వీటు తినిపించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనిల్, రణధీర్ రెడ్డి, ప్రశాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా రవి

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలోని ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా మొటం రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నూతన కార్యవర్గాన్ని కుల పెద్ద మనుషులు ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా పెండ్యాల కుమారస్వామి, కార్యదర్శి శానబోయిన రవి, సహాయ కార్యదర్శిగా పర్షబోయిన చెన్నమల్లు, కోశాధికారిగా బండి రంజిత్, సహాయ కోశాధికారిగా పర్షబోయిన శంకర్, కార్యవర్గ సభ్యులుగా మూడెడ్ల మొగిలి, బయ్య రాజు, పెండ్యాల వేణు, శానబోయిన రవి, గోపురబోయిన మల్లేష్ ఎంపికయ్యారు. పూజారి పెండ్యాల పైడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చైర్మన్ రవి తెలిపారు.

మొక్కలు తొలగించరా ?

- ప్రమాదం అని తెలిసినా కోనాకార్పస్ మొక్కలను పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆందోళనలో పట్టణ ప్రజలు, వ్యాపారులు

పరకాల : చూడటానికి పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించినా.. ఆ మొక్కల ద్వారా ఉన్న ప్రమాదం తెలిస్తే భయపడాల్సిందే..ఆ మొక్కలే కోనాకార్పస్ మొక్కలు. మనుషుల శ్వాసకోశ వ్యాధులకు దారితీసే మొక్కలపై కనీసం పక్షులు కూడ వాలవంటే అవి ఎంత ప్రమాదకరమో అర్థమవుతుంది. అన్యజాతుల మొక్కల్లో ఒకటైనా కోనాకార్పస్ మొక్కలపై ఎలాంటి అవగాహన లేకుండా గత ప్రభుత్వం నిర్వహించిన హరితహారంలో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి పరకాల మున్సిపాలిటీ డివైడర్స్ మధ్యలో ఏర్పాటు చేశారు. కొంత కాలం తర్వాత ఆ మొక్కలతో ఉన్న ప్రమాదాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వాటిపై నిషేధం విధించి నర్సరీల్లో ఉన్న మొక్కలను సైతం దహనం చేయించింది. ప్రభుత్వం నిషేధించిన డివైడర్స్ మధ్యలో ఉన్న మొక్కల తొలగింపు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. మొక్కల ప్రభావం తమపై పడి శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నామంటూ వ్యాపారస్తులు కొందరు ఆయా మొక్కలను తొలగించేందుకు ప్రయత్నించగా మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే కోనాకార్పస్ మొక్కలను తొలగించకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

స్వచ్ఛందంగా మొక్కల తొలగింపు

పట్టణంలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో సైతం కోనాకార్పస్ మొక్కలు ఉండటంతో విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా తల్లిదండ్రుల ఫిర్యాదులపై ఆయా విద్యాసంస్థలు స్వచ్ఛందంగా తొలగించాయి. కానీ పట్టణంలోని ప్రధాన రహదారుల పొడవునా కానోకార్పస్ మొక్కలు పచ్చదనంగా కనిపిస్తున్నాయి. అయితే పచ్చదనం వెనుక ప్రజలకు పొంచి ఉన్న ముప్పును మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు గుర్తించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పరకాల-హుజురాబాద్ రోడ్డులో డివైడర్ల మధ్య ఏపుగా పెరిగిన కోనా కార్పస్ చెట్లు

ప్రాణాలతో చెలగాటమే



నిత్యం రోడ్డు పక్కనే ఉండే కోనాకార్పస్ మొక్కలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కో సమయంలో కుటుంబ సభ్యులంతా ఉంటున్నాం. తామంతా శ్వాస కోశవ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. మొక్కలను తక్షణమే తొలగించాలి.

– రాము, మెడికల్ స్టోర్ యజమాని, పరకాల

దగ్గరికి వెళ్లాలంటే భయమేస్తోంది



రోడ్డు వెంట పచ్చదనంగా కనిపిస్తున్న మొక్కల కింద కూర్చునేవాళ్లం. కానీ అవి చాలా ప్రమాదకరమని, దయ్యం చెట్లని పిలుస్తుంటే నమ్మలేకపోయాం. వాస్తవానికి ఆయా చెట్ల ద్వారా మాకు సరైన గాలి రాకపోగా అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

– ఒంటేరు నరేష్, బైక్ మెకానిక్, పరకాల

విజేతలకు నగదు పురస్కారాలు



మహిళలకు నగదు బహుమతులు అందజేస్తున్న ప్రభాకర్

శాయంపేట : మండలంలోని కాట్రపల్లిలో కాట్రపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని బతుకమ్మ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన మొట్లపల్లి నిర్మలకిషోర్‌కు రూ.5116, ద్వితీయ స్థానంలో నిలిచిన చిర్ర అనురాధకృష్ణకు రూ.3116, తృతీయ స్థానంలో నిలిచిన జనగాం మమత సాంబయ్యకు రూ,1,116 నగదు పురస్కారాలను గ్రామ యూత్ నాయకుడు ఆరే ప్రభాకర్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అజ్మీరా ఉమారఘుసింగ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు గౌస్, గ్రామస్తులు వీరస్వామి, భాస్కర్, జగన్, ఎలిషా, జనార్ధన్, యూత్ సభ్యులు భగత్, తిరుపతి, అనిల్, అశోక్, సుమన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు కమలాపూర్‌లో కోలాట పోటీలు

కమలాపూర్: ప్రగతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం దసరా (విజయదశమి) సందర్భంగా కమలాపూర్ మార్కెట్ (రావిచెట్టు) వద్ద శనివారం సాయంత్రం 4 గంటలకు కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రగతి యూత్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ కార్యవర్గం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పోటీల్లో పాల్గొనే కోలాట బృందాలు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, బృందాలు విధిగా డ్రెస్ కోడ్ వేసుకొని రావాలని, తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలు, నిర్వాహకులదేనని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి నగదు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే కోలాట బృందాలు బాలసాని కుమారస్వామి 89780 48096 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక



గట్లకానిపర్తిలో ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తిలో గ్రామ అభివృద్ధి కమిటీని శుక్రవారం గ్రామపెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా బొమ్మకంటి ముత్యాలు, నాగరాజు, పెద్దిరెడ్డి సుభాష్ రెడ్డి, సముద్రాల లింగమూర్తి, నరెడ్ల రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు గ్రామానికి వైకుంఠ రథం వాహనం సమకూర్చడం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్మశానవాటిక, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు గురించి పని చేయాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, నాయకులు గుర్రం అశోక్, బుస్స సంపత్, చెన్నబోయిన అజయ్, బొమ్మకంటి రాజేందర్, కుమార్, కర్ణాకర్ రెడ్డి, రాజేందర్, కర్ణాకర్, శ్రీకాంత్, గోపి, రాజు, రాజకుమార్, మహేందర్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు హారతులు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే మహాన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ కోమండ్ల చంద్రారెడ్డి, బూర సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- రహదారి పక్కనే ప్రమాదకరంగా వ్యవసాయ బావి
- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఇబ్బందుల్లో వాహనదారులు

నడికూడ : ఎంత జాగ్రత్తగా వాహనాలు నడిపినా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు, వాహనాదారులు ఆందోళన చెందుతుండగా ప్రధాన రహదారులకు ఎలాంటి రక్షణ గోడలు లేకుండా ఉన్న వ్యవసాయ బావులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. మండల కేంద్రం నుంచి హనుమకొండ, వరంగల్‌కు పోయే ప్రధాన రహదారి, రాత్రి పగలు తేడా లేకుండా నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రాత్రివేళలో ముఖ్యంగా వరంగల్ మార్కెట్‌కు లోడ్ బండ్లు వెళ్తుంటాయి. ఈ రహదారి పక్కనే ప్రమాదకరంగా వ్యవసాయ బావి ఉంది. నడికూడ బస్టాండ్ నుంచి ధర్మారం వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నడికూడ గ్రామ శివారు వరకు సీసీ రోడ్డు పోసి వదిలేయడం జరిగింది. అక్కడ ఉన్న వ్యవసాయ బావికి రక్షణ గోడ ఉన్నప్పటికీ రోడ్డు విస్తరణ కారణంగా పోసిన సీసీ రోడ్డు ఎత్తు పెరగడంతో బావి రక్షణ గోడ రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో, ఏ మాత్రం వాహనాలు అదుపుతప్పినా బావిలోకి దూసుకెళ్లడం ఖాయం. వాహనాదారులకు ఈ రోడ్డు గురించి అవగాహన లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. కనీసం ఇక్కడ హెచ్చరిక బోర్డు అయిన ఏర్పాటు చేసి, మళ్లీ ఇనుప తీగతో రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి

ఇనుప కంచె ఏర్పాటు చేయాలి



ధర్మారం–గొల్లపల్లె రోడ్డు వెంబడి ఉన్న ఈ బావికి రక్షణ గోడ ఉన్నా ఇటీవల సీసీ రోడ్డు పోసి అనంతరం మట్టి పోయడంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి తిరిగి రక్షణ గోడ, ఇనుప కంచె నిర్మించి హెచ్చరికబోర్డు ఏర్పాటు చేయాలి.

– మేకల రవి, ట్రాక్టర్ డ్రైవర్, గొల్లపల్లి

డప్పుల వితరణ

గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలీకి చెందిన నేతాజీ సర్వీస్ టీమ్ అధ్యక్షుడు మొగసాని శంకర్ అతడి తండ్రి సాంబయ్య జ్ఞాపకార్థం కుల పెద్దలు డక్క రాజమొగిలి, డక్క సాంబయ్య సమక్షంలో డప్పు కళాకారులకు శుక్రవారం 16 డప్పులు అందజేశారు. అనంతరం శంకర్ మాట్లాడారు. దసరా పండుగను పురస్కరించుకుని తన తండ్రి జ్ఞాపకార్థం కళాకారులకు తన సొంత డబ్బుతో డప్పులు కొనుగోలు చేసిన అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బేతినేని రాజయ్య, మొగసాని వీరస్వామి, వీరారావు, బోనాల అశోక్, మండల సదానందం, కొత్తగట్టు కోటేశ్వర్, కొమ్ము రాజు, మంచాల మల్లికాంబ, నకినబోయిన నాగరాజు, సుభాష్, సుధాకర్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

14న పద్మశాలి ప్రతిభా పురస్కారాలు

వరంగల్ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పద్మశాలి ప్రతిభ, పురస్కారాలను ఈనెల 14న కొత్తవాడ పద్మశాలి భవనంలో ప్రదానం చేయనున్నట్లు పోపా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండు కామేశ్వర్, పాము శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి పురస్కారాల కరపత్రాలను పద్మశాలి సంఘం నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి పురస్కార కన్వీనర్ గోషికొండ సుధాకర్, పోపా ప్రతినిధులు మా టేటి అశోక్‌కుమార్, అనిల్, సుభాష్, చెన్నూరు రమేష్, గుండేటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మృతి



ఓంకార్ (ఫైల్)

గీసుకొండ : మండలంలోని మొగిలిచర్లకు చెందిన ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) కూనమల్ల ఓంకార్(46) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఓంకార్ కొంతకాలంగా లంగ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతుండగా ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు మృతుడి బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద అదనపు డీఆర్‌డీఓ రేణుక రూ.20 వేలు, మండల పరిషత్ కార్యాలయం నుంచి రూ.18 వేలను అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఈజీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మ్యాదరి మోహన్‌రావు, ఎంపీడీఓ కృష్ణవేణి, డీఆర్‌డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ పరమాత్మ, ఏఓ హరిప్రసాద్‌బాబు, ఏపీఓ చంద్రకాంత్, ఏపీఎం సురేశ్‌కుమార్, కమలాకర్, ప్రభాకర్, పరామర్శించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



గోపాల్‌పూర్‌లో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి : అకాల భారీ వర్షానికి చేతికొందొచ్చిన వరి పంటలు నేలవాలి నష్టం వాటిల్లిందని, నష్టం వాటిల్లిన రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి మండలంలోని వివధ గ్రామాల్లో వరిపంట నేలవాలింది. శుక్రవారం సీపీఐ నాయకులు నేలవాలిన వరిపంటలను పరిశీలించారు. గోపాల్‌పూర్‌కు చెందిన ఎల్తూరి రాజేష్ రైతుకు చెందిన ఎనమిది ఎకరాల్లో వరిపంట సాగుచేయగా అందులో మూడెకరాలు నేలవాలి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, నాయకులు నిమ్మల మనోహర్, సూర మొగిళి, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మహేందర్‌రావు

ధర్మసాగర్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ మహేందర్‌రావు సూచించారు. మండలంలోని ఎల్కుర్తి గ్రామంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి ఆదేశాల మేరకు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహేందర్‌రావు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, పాలు, గుడ్లు లాంటి పౌష్టికాహారం ఎక్కువమోతాదులో తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆత్మకూరు: దుర్గాదేవికి హారతి ఇస్తున్న మహిళలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం దుర్గామాతను సిద్ధరాత్రి అవతారంలో అలంకరించారు. అలాగే అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి మహిళలచే కుంకుమ పూజ చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి ఉత్సవ నిర్వాహకులు మహాన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబు, వినయ్‌శర్మ, సందీప్‌శర్మ, రాజయ్య, శరత్‌శర్మ, ఉన్నారు.

శాకంబరిదేవిగా భద్రకాళి అమ్మవారు

ఎల్కతుర్తి: దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజును పురస్కరించుకొని భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు ఉదయం శాకంబరిదేవి రూపం, సాయంత్రం మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ కిషన్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

మహిషాశురమర్ధిని అలంకరణలో అమ్మవారు

పరకాల: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీఉమామహేశ్వర స్వామి దేవస్థానం , కనకదుర్గమ్మ మదన పోచమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాశురమర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నా గెల్లి రంజిత్, ఇంగిళి వీరేష్‌రావు, మూసినపల్లి శివప్రసాద్, పచ్చిక శంతన్‌రెడ్డి, పింటు, సాయి, రాజేంద్రప్రసాద్, రాకేష్, మధు, వరప్రసాద్, శివప్రసాద్, మనోహర్, పప్పులు, రామ్‌చరణ్, సిద్ధు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి: శాకంబరిదేవిగా భద్రకాళి అమ్మవారు



పరకాల : మహిషాసురమర్ధిని అలంకరణలో..



పరకాల: అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

రాజుకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు ఎం. రాజుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.